

శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు : రూ. 7.27.224
బంగారం : 2 గ్రాముల 590 మిల్లీ గ్రాములు
వెండి : 47 గ్రాముల 600 మిల్లీ గ్రాములు
– భువనేశ్వర్/పూరీ



మన సంస్కృతి గొప్పది

రాయగడలో అమో నృత్యో..అమో సంస్కృతి నిర్వహించారు. ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. - 8లో▸



సాధువులకు స్వాగతం

చత్తీస్‌గఢ్ నుంచి ఏడుగురు సాధువులు వచ్చారు. మల్కన్‌గిరిలో ఘనంగా స్వాగతం పలికారు. - 8లో▸

న్యూస్‌రీల్

సరిహద్దు గ్రామాల్లో చిరుత సంచారం



దుదుబా గ్రామంలో ఒక ఉపాధ్యాయుడి ఇంటి పిట్ట గోడ మీద చిరుత పులి

కొరాపుట్: సరిహద్దు ప్రాంతాల్లో చిరుత పులి సంచారం అందరినీ భయ భ్రాంతులకు గురి చేస్తోంది. ఆదివారం నబరంగ్‌పూర్ జిల్లా రాయిఘర్ సమితి పక్కనే ఉన్న రాష్ట్ర సరిహద్దు అవతల ఉన్న కాంకేర్ జిల్లా దుదుబా, మకిడి కానా గ్రామాల్లో చిరుత పులి సంచరించింది. సాయంత్రం అయ్యేసరికి గ్రామాల్లోకి వచ్చేస్తోంది. అటవీ శాఖ సిబ్బంది గ్రామాలలో పర్యటిస్తూ పులిని పట్టుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. కానీ వారి ప్రయత్నాలు విఫలమవుతున్నాయి. ఈ వార్తలు జిల్లాలో సరిహద్దు గ్రామాల ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి.

పినాంగి పర్వత అడవిలో అగ్ని ప్రమాదం



పినాంగి సంరక్షిత అడవిలో ఎగసిపడుతున్న మంటలు

జయపురం: జయపురం విక్రమదేవ్ విశ్వవిద్యాలయం వెనుక వైపున ఉన్న పినాంగి రిజర్వ్ ఫారెస్ట్‌లో శనివారం రాత్రి అగ్ని ప్రమాదం సంభవించింది. అటవీ విభాగానికి ఆలస్యంగా సమాచారం అందడంతో వారు వెళ్లి మంటలను ఆర్పారు. ఎవరో ఎండు ఆకులకు అగ్గి పెట్టి ఉంటారని, అందుచేత మంటలు విస్తరించి ఉంటాయని భావిస్తున్నారు.

బెదిరింపు కేసులో నిందితుడి అరెస్టు

జయపురం: జయపురం సదర్ పోలీసు స్టేషన్ పరిధిలో ఒక వ్యక్తిని బెదిరించి రూ.లక్ష డిమాండ్‌చేసిన నిందితుడిని జయపురం సదర్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ విషయం సదర్ పోలీసు అధికారి సచీంద్ర ప్రదాన్ వెల్లడించారు. ఈ నెల 3 వ తేదీ మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో జయపురం సమితి దుబులి గ్రామ వాసి కింకర్ సర్కార్(28) లిఖిత ఫిర్యాదు చేశారని ఆయన వెల్లడించారు. ఈ నెల 2వ తేదీ రాత్రి 8.45 గంటల సమయంలో డొంబుగుడ గ్రామం ఆటో డ్రైవర్ కృష్ణ టక్రి తన ఇంటికి వచ్చి ఒక లక్ష రూపాయలు డిమాండ్ చేశాడని, ఇవ్వనని చెబితే ఇళ్లు, భూములు ఖాళీ చేసి వెళ్లిపొమ్మని హెచ్చరించాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. 3వ తేదీ మధ్యాహ్నం 12 గంటల సమయంలో కృష్ణ టక్రి కొంత మంది అనుచరులతో కలసి సర్కార్ ఇంటికి వచ్చాడు. కత్తితో చంపుతానని బెదిరించి రూ.5వేలు తీసుకెళ్లిపోయాడని తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి కృష్ణ టక్రిని గుర్తించి అరెస్టు చేసినట్లు వెల్లడించారు. అతడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచామని తెలిపారు.

బైకు దొంగలు దొరికారు



పోలీసులు స్వాధీనం చేసుకున్న బైకులు

రాయగడ: జిల్లాలోని బిసంకటక్‌లో గల పలు ప్రాంతాల్లో చోరీకి గురైన 5 బైకులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి ముగ్గురుని అరెస్టు చేశారు. అరెస్టయిన వారు 15 ఏళ్ల లోపువారు కావడంతో వారిని భవానీపట్నంలో గల బాలల కారాగారానికి ఆదివారం తరలించారు. పోలీసులు తెలియజేసిన వివరాల ప్రకారం.. శివరాత్రి రోజు బిసంకటక్ సమితిలో గల చాటికొన శైవక్షేత్రంలో శివుని దర్శనం కోసం వెళ్లిన హిమిరిక బైకు దొంగతనానికి గురైంది. దీనికి సంబంధించి బాధితుడు బిసంకటక్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు ఈ మేరకు దర్యాప్తు చేపట్టారు. ఇందులో భాగంగా ఓ వ్యక్తిని రాయగడలో పట్టుకున్నారు. అనంతరం అతనిని బిసంకటక్ పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారించగా.. బైకు దొంగతనం చేసిన మరో ఇద్దరి వివరాలను పోలీసులకు చెప్పాడు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు.

పూరీ రథయాత్రకు యునెస్కో వారసత్వ హోదా సన్నాహాలు



పూరీ శ్రీ జగన్నాథ రథ యాత్ర (ఫైల్)

భువనేశ్వర్: పూరీ శ్రీ జగన్నాథ రథ యాత్రకు యునెస్కో ఇంటాంజిబుల్ సాంస్కృతిక వారసత్వ గుర్తింపు పొందేందుకు సన్నాహాలు ఊపందుకుంటున్నాయి. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు పూర్తి చేసినట్లు శ్రీ మందిరం ప్రధాన పాలన అధికారి సీఏఓ డాక్టరు అరవింద కుమార్ పాఢి తెలిపారు. రథ యాత్రకు యునెస్కో వారసత్వ హోదా కోసం పూర్తి స్థాయి సహాయ సహకారాలు అందించేందుకు కేంద్ర సాంస్కృతిక శాఖ ఆసక్తి కనబరిచినట్లు ఆయన తెలిపారు. శ్రీ జగన్నాథ స్వామి వార్షిక రథ యాత్ర దేశ వ్యాప్తంగా, ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మంది భక్తులను ఆకర్షించే ప్రపంచ ప్రఖ్యాత పూరీ రథ యాత్ర లేదా రథోత్సవంగా ప్రసిద్ధి. యునెస్కో ఇంటాంజిబుల్ సాంస్కృతిక వారసత్వ గుర్తింపు పొందే ప్రక్రియను శ్రీ జగన్నాథ ఆలయం పాలక వర్గం ఎస్‌జేటీఏ ప్రారంభించింది. ఈ గుర్తింపు కోసం త్వరలో నామినేషను దస్తావేజులు సమర్పించనున్నట్లు సీఏఓ వివరించారు. ఇటీవల ఢిల్లీ పర్యటన సందర్భంగా ఈ మేరకు కేంద్ర సాంస్కృతిక శాఖ అధికారులతో ఈ విషయంపై చర్చించి వారి మద్దతు కోరారు. చర్చలు సానుకూలంగా జరిగాయని, సంబంధిత అధికారులు త్వరితగతిన చర్యలు తీసుకుంటారని భావిస్తున్నారు. ఈ ప్రక్రియకు త్వరిత పరిష్కారం లభిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ గౌరవనీయమైన హోదా పొందడం వల్ల రథ యాత్రకు వారసత్వ గౌరవం పరిరక్షించడంతో భారత దేశపు గొప్ప సాంస్కృతిక, మతపరమైన సంప్రదాయాల పట్ల ప్రపంచ వ్యాప్తంగా దృష్టిని ఆకట్టుకోవచ్చని ఎస్‌జేటీఏ భావిస్తుంది.

మాజీ మంత్రి అనంత దాస్ కన్నుమూత



అనంత దాస్



మరణశయ్యపై అనంత దాస్

భువనేశ్వర్: బాలాసోర్ జిల్లా భొగొరాయ్ మాజీ ఎమ్మెల్యే, మంత్రి అనంత దాస్ (85) కన్నుమూశారు. భువనేశ్వర్‌లో తన నివాసంలో ఆదివారం ఉదయం తుది శ్వాస విడిచారు. దీర్ఘకాలంగా వయో సంబంధిత అనారోగ్యంతో బాధపడుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగానికి స్వస్తి పలికి 2004 సంవత్సరంలో ఆయన ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగిడారు. అది మొదలుకొని వరుసగా నాలుగు పర్యాయాలు బిజూ జనతా దళ్ అభ్యర్థిగా భొగొరాయ్ నియోజక వర్గం నుంచి రాష్ట్ర శాసన సభకు ప్రాతినిధ్యం వహించారు. తొలి సారి 2004 నుంచి 2009 వరకు ఎమ్మెల్యే, 2009 నుంచి 2014 వరకు శాసన సభ చీఫ్ విప్, 2014 నుంచి 2019 వరకు ఉన్నత విద్య మరియు పరిశ్రమల శాఖ మంత్రిగా కీలకమైన బాధ్యతల్ని విజయవంతంగా నిర్వహించారు. ఆయన 2019 నుంచి 2024 వరకు జిల్లా ప్రణాళిక బోర్డు చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు. అనంత దాస్ ఆగస్టు 28, 1940న భొగొరాయ్ మండలం కురుతియాలో జన్మించారు. మరణించే సమయానికి ఆయన వయస్సు 85 ఏళ్లు. అనంత దాస్ మరణంతో తన నియోజక వర్గం భొగొరాయ్ ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

ప్రకృతి సురక్ష పాదయాత్ర



ప్రకృతి సురక్షా పాదయాత్రలో చిత్తరంజన్ షాడంగి తదితరులు



పాదయాత్రలో పాల్గొన్న యువతులు

జయపురం: ప్రకృతి పరిరక్షణపై ప్రజలకు అవగాహన కలిగించే ప్రధాన లక్ష్యంతో ప్రకృతి సురక్ష యాత్ర ప్రారంభించారు కొంతమంది గాంధేయ వాదులు. ప్రకృతి సురక్షా పాదయాత్ర అవిభక్త కొరాపుట్ మల్కన్‌గిరిలో గత నెల 28న ప్రారంభమైంది. చిత్తరంజన్ షాడంగి నేతృత్వంలో మల్కన్‌గిరి నుంచి ప్రారంభమైన యాత్ర శనివారం సాయంత్రం జయపురం చేరింది. ఈ పాదయాత్రలో రాయగడ జిల్లా బలరాం పండ, విశ్రాంత ఉపాధ్యాయులు రవీంద్ర నాథ్ అటోయి, ఒడిశా ఆరోగ్య సేవా సమితి ఉపాధ్యక్షుడు స్మృతి శేఖర సాహు, మహారాష్ట్ర నుంచి వచ్చిన నెహాల్ గాంధీ, జగదీష్ చండాల్, సందీప్ చాటే, సూర్య ప్రధాన్, పూరీ నీలకంఠ బేద్య, సంఘ సామాజిక కార్యకర్తలు కొరాపుట్, రాయగడ, మల్కనగిరి జిల్లాల నుంచి పలువురు పాల్గొన్నారు. ప్రతి దినం 15 కిలోమీటర్ల దూరం పాదయాత్ర జరుపుతూ 44 దినాలలో 670 కిలోమీటర్లు పాదయాత్ర నిర్వహించుకుంటూ ఏప్రిల్ 12న పూరీ చేరుకుంటామన్నారు. మహాత్మా గాంధీ ఆంగ్లేయ పాలకులకు వ్యతిరేకంగా ఉప్పు సత్యాగ్రహం ప్రారంభించి 1930 ఏప్రిల్ 12 వ తేదీన గుజరాత్ దండీలో పూర్తి చేశారని గుర్తు చేశారు. ఈ యాత్రలో రాయగడ, మల్కన్‌గిరి సరిహద్దు రాష్ట్రాల నుంచి 25 మందికి పైగా పురుషులు, మహిళలు పాల్గొన్నారు. వీరు పూరీలో జరిగే మూడు దినాల జాతీయ స్థాయి సమ్మేళనంలో పాల్గొంటారు.

అటవీ శాఖ మహిళా గార్డులకు సత్కారం



పర్లాకిమిడి డీఎఫ్ఓ కార్యాలయంలో మహిళా గార్డులకు సత్కారం

పర్లాకిమిడి: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గజపతి జిల్లాలో దేవగిరి, మహేంద్రగిరి, రామగిరి, మోహానా ప్రాంత అటవీ శాఖలో పనిచేస్తున్న ఎనిమిది మంది మహిళా అటవీ శాఖ గార్డులను అటవీ శాఖ అధికారి బ్రహ్మానంద సాహు ప్రశంసాపత్రాలతో సన్మానించారు. మహిళా గార్డులకు ఈ సత్కారసభ పర్లాకిమిడి డీఎఫ్ఓ కార్యాలయం కాన్ఫరెన్స్ హాలులో ఆదివారం జరిగింది.

పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

భువనేశ్వర్: రాష్ట్రంలో పగటి పూట వాతావరణంలో భారీ మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో ఉష్ణోగ్రత పెరగనుందని వాతావరణ శాఖ ఐఎండీ ముందస్తు సమాచారం జారీ చేసింది. ఈ పరిస్థితుల్లో వడ దెబ్బ వంటి వైపరీత్యాలకు గురి కాకుండా ప్రజలు జాగ్రత్త వహించాలని ప్రత్యేక సహాయ కమిషనరు (ఎస్ఆర్‌సి) కార్యాలయం మార్గదర్శకాలు జారీ చేసింది. ఐఎండీ అంచనా ప్రకారం రానున్న 4, 5 రోజుల్లో రాష్ట్రంలోని అంతర్గత జిల్లాలలో పగటి పూట ఉష్ణోగ్రతలు క్రమంగా 3 నుంచి 5 డిగ్రీల సెల్సియస్ వరకు పెరిగే అవకాశం ఉంది. ఈ లెక్కన రాష్ట్రంలో గరిష్ఠ ఉష్ణోగ్రత 40 డిగ్రీల సెల్సియస్ తాకే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అంచనా. ఈ నేపథ్యంలో తగిన చర్యలు తీసుకోవాలని ప్రత్యేక సహాయ కమిషనరు (ఎస్ఆర్‌సి) కార్యాలయం ఆదివారం అన్ని జిల్లా కలెక్టర్లకు సమాచారం జారీ చేసింది. ప్రత్యేక సహాయ కమిషనరు కార్యాలయం సమాచారం ప్రకారం సుందర్‌గఢ్, ఝార్సుగుడ, సంబల్‌పూర్, సోన్ పూర్, బౌధ్ మరియు బొలంగీర్ జిలాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రత 37 డిగ్రీల సెల్సియస్ పైబడి నమోదు అవుతున్నందున రాబోయే ఐదు రోజుల్లో ఆయా ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రత 40 డిగ్రీల సెల్సియస్, అంతకంటే ఎక్కువ పెరిగే అవకాశం ఉంది.

వృద్ధుల పట్ల జాగ్రత్త

ఎస్ఆర్సీ సలహా ప్రకారం ఉష్ణోగ్రత పెరుగుదలని సాధారణ ప్రజలు తట్టుకోగలరు. శిశువులు, వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారికి స్వల్ప ఆరోగ్య సమస్యలను కలిగిస్తుంది. ప్రధానంగా ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు బయటకు వెళ్లేటప్పుడు ప్రజలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ఎస్‌టీఎఫ్ అదుపులో బంగ్లా దేశీయులు





ఎస్టీఎఫ్‌కు చిక్కిన బంగ్లాదేశీ పురుషులు



ఎస్‌టీఎఫ్ అదుపులో బంగ్లాదేశీ మహిళలు

భువనేశ్వర్: స్థానిక రైల్వే స్టేషన్‌లో తచ్చాడుతున్న బంగ్లా దేశీయుల్ని ప్రత్యేక టాస్కు ఫోర్సు ఎస్‌టీఎఫ్ అదుపులోకి తీసుకుంది. వీరిలో ఆ మంది మహిళలు, ఒక మైనర్‌తో సహా 10 మంది బంగ్లాదేశ్ జాతీయులు ఉన్నట్లు ఎస్‌టీఎఫ్ పేర్కొంది. వీరిని అక్రమ చొరబాటుదారులుగా భావిస్తున్నారు. వీరి రాకకు సంబంధించి పాస్‌పోర్ట్, వీసా లేదా ఇతరేతర చెల్లుబాటు అయ్యే ప్రయాణ పత్రాలు, ఆధారాలు లేకపోవడంతో ఈ సందిగ్ధత నెలకొంది. వీరి దగ్గర నుంచి 7 మొబైల్ ఫోన్లు, కొన్ని బంగ్లాదేశ్ కరెన్సీ నోట్లు, భారతీయ కరెన్సీ నోట్లను స్వాధీనం చేసుకున్నారు. విచారణ కొనసాగుతుంది.

విద్యార్థిపై దాడి

- దర్యాప్తు చేపట్టిన అధికారులు



విద్యార్థిపై దాడి చేస్తున్న తోటి విద్యార్థులు

రాయగడ: జిల్లాలోని గుణుపూర్ తహసీల్దార్ కార్యాలయం సమీపంలో గల వంద పడకల సామర్థ్యం గల అన్వేష హాస్టల్‌లో చదువుతున్న విద్యార్థిపై తోటి విద్యార్థులు దాడి చేసిన ఘటనకు సంబంధించి వీడియో వైరలైంది. సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్న వీడియోను చూసిన సంబంధిత శాఖ అధికారులు ఈ మేరకు దర్యాప్తు చేపట్టారు. హాస్టల్‌లో చదువుతున్న విద్యార్థుల సంరక్షణకు సంబంధించి తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత కొద్ది నెలల క్రితం జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో గల సంక్షేమ శాఖ పరిధిలో గల హాస్టళ్లల్లో చదువుతున్న కొంత మంది విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడటం సంచలనం సృష్టించింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించి.. హాస్టళ్ల పనితీరు, తదితర అంశాలకు సంబంధించి వాస్తవాలను తెలియజేసేందుకు దర్యాప్తునకు కూడా ఆదేశించింది. తాజాగా జిల్లాలోని గుణుపూర్‌లో గల రాష్ట్ర సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్వేష హాస్టల్‌లో చదువుతున్న విద్యార్థిపై తోటి విద్యార్థులు దాడి చేసిన సంఘటన తీవ్ర కలకలం రేపింది. ఒకటి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ఈ హాస్టల్‌లో ఉంటున్నారు. విద్యార్థిని తోటి విద్యార్థులు దాడి చేసి గాయపరిచారు. విద్యార్థి ఎంత మొరపెట్టుకున్నా ఒకరి తరువాత మరొకరు గాయపరుస్తూనే ఉన్నారు. కేకలు పెట్టినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. అనంతరం నిర్వాహకులు గాయాలకు గురైన విద్యార్థిని గుణుపూర్ ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. గుట్టుచప్పుడు లేకుండా విద్యార్థిని చికిత్స చేయించిన అనంతరం తిరిగి హాస్టల్‌కు తరలించారు. శనివారం రాత్రి ఈ విషయమై వీడియో వైరల్ అవ్వడంతో అధికారులు దర్యాప్తు చేపట్టారు.

జయపురంలో సత్య సాయి స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రం



జయపురంలో స్కిల్ డెవలపమెంట్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు పట్నాయిక్



ప్రారంభించిన కంప్యూటర్ శిక్షణ తరగతి

జయపురం: సత్య సాయిబాబా శతజయంతి ఉత్సవాల సందర్భంగా శ్రీసత్య సాయి సేవా ఆర్గనైజేషన్ ఒడిశా తరపున 10 వ స్కిల్ డలప్‌మెంట్ కేంద్రాన్ని జయపురంలో ఆదివారం ప్రారంభించారు. శ్రీసత్య సాయి సేవా ఆర్గనైజేషన్ ఒడిశా అధ్యక్షుడు డాక్టర్ సత్య స్వరూప్ పట్నాయిక్ స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహుళ ఆదివాసీ అవిభక్త కొరాపుట్‌లో విద్య, ఉద్యోగాలకు ప్రజలు సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆ సమస్యలను గుర్తించి విద్యార్థుల్లో ఉన్న ప్రతిభకు పదును పెట్టేలా ఉచిత శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించామన్నారు. ఈ కేంద్రంలో విద్యార్థులకు కంప్యూటర్ విద్యా శిక్షణ, టైలరింగ్ శిక్షణ ఇస్తారన్నారు. మొదటి ఏడాది 18 మందికి కంప్యూటర్ శిక్షణ, 12 మందికి టైలరింగ్ శిక్షణ ఇస్తారని, సోమవారం నుంచి శిక్షణలు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్రీసత్య సాయి సేవా సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు నాగభూషణం, కొరాపుట్ అధ్యక్షుడు మార్కండేయులు, శ్రీసత్య సాయి ట్రస్టు సభ్యులు సునీల్ మహంతి, రవి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కోశల వ్యాఖ్యల దుమారం

- బీజేపీ ఎమ్మెల్యే జయనారాయణ్ మిశ్రా సంచలన వ్యాఖ్యలు
- రాజకీయ శిబిరాల్లో చర్చ

భువనేశ్వర్: రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) సీనియర్ నాయకుడు, సంబల్‌పూర్ ఎమ్మెల్యే జయనారాయణ మిశ్రా ప్రసంగం రాజకీయ దుమారం రేపింది. సుభద్ర యోజన రెండో వాయిదా పంపిణీ పురస్కరించుకుని సంబలపూర్‌లో ఏర్పాటు చేసిన సభలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కోశలను ఒడిశాలో విలీనం చేయడం అతి పెద్ద చారిత్రాత్మక తప్పిదంగా వ్యాఖ్యానించారు. ఈ తప్పిదంతో కోశల ప్రాంతం నిర్లక్ష్యానికి గురై వెనుకబాటుకు గురవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయ వ్యవస్థని కుదిపేస్తున్నాయి. దేశంలో భాషా ప్రాతిపదికన ఏర్పడిన తొలి రాష్ట్రంగా ఒడిశా ఘన చరిత్రని కూడగట్టుకుంది. అధికార పక్షం ఎమ్మెల్యే జయ నారాయణ మిశ్రా వ్యాఖ్యలతో ఈ చరిత్ర కళంకితం అయిందని ప్రతిపక్షాలు దుయ్యబడుతున్నాయి. ఒడిశా ఆత్మ గౌరవం (అస్మిత) పరిరక్షణ హామీతో గద్దెనెక్కిన బీజేపీ సభ్యులు ఇలాంటి వ్యాఖ్యలు చేయడం వివాదానికి దారితీశాయి.

సంబల్‌పూర్‌లో సుభద్ర యోజన రెండో వాయిదా చెల్లింపు కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే జయనారాయణ మిశ్రా మాట్లాడుతూ ఉత్కళ, కోశల, కళింగ ప్రాంతాల విలీనంతో ఒడిశా ఏర్పడిందని చారిత్రాత్మక వివరాలు గుర్తు చేశారు. కాలానుక్రమంగా ఒడిశా అంటే ఉత్కళకు పరిమితమైపోయిందన్నారు. భౌగోళికంగా ఉత్కళ అంటే కటక్, పూరీ, బాలసోర్ ప్రాంతాలను సూచిస్తుందని అన్నారు. ఒడిశాలో మరో రెండు ప్రాంతాలు కోశల, కళింగ ప్రాంతాలు క్రమంగా నిర్లక్ష్యానికి గురయ్యాయని అన్నారు. ఉత్కళ, కోశల, కళింగ ప్రాంతాల విలీనం తర్వాత ఒడిశా ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిందని సంబలపూర్ ప్రజలు గుర్తుంచుకోవాలని జయ నారాయణ మిశ్రా మరింత గట్టిగా నొక్కి ప్రసంగించడంతో వివాదం భగ్గుమంటోంది. ఒడిశాలో సంబల్‌పూర్, కోశల ప్రాంతాన్ని విలీనం చేసినప్పటి నుంచి అక్కడి ప్రజలు దోపిడీకి గురవుతున్నారని మిశ్రా అన్నారు. మనం ప్రతి రంగంలోనూ దోపిడీకి గురవుతున్నాము... గనులు, వ్యవసాయం, అటవీ, సేవలు ఇలా అన్ని రంగాల్లో అన్యాయమే ఎదురవుతుందన్నారు.

ఏమై ఉంటుంది..?

సంబలపూర్ ఎమ్మెల్యే జయ నారాయణ మిశ్రా వ్యాఖ్యలతో సొంత పార్టీ చిక్కుల్లో పడింది. అధికారంలోకి వచ్చిన తర్వాత బీజేపీ అధిష్టానం తనను నిర్లక్ష్యం చేసిందని ఆయన బహిరంగంగానే ఆరోపించారు. ఉద్దేశపూర్వకంగా తనకు కీలకమైన అంశాల్లో దూరంగా ఉంచుతుందని మాజీ మంత్రి సమీర్ దే సంతాప సభలో గత ఏడాది నవంబర్ 30న బహిర్గతం చేశారు. ఈ వ్యాఖ్యలతో కోలుకోకముందే తాజా ప్రసంగంతో బీజేపీకి కంటి మీద కునుకు చెదరగొట్టారు. రేపో మాపో మోహన్ చరణ్ మాఝి మంత్రి మండలి విస్తరణ జరగాల్సి ఉంది. కొత్త కొలువులో తనకు స్థానం పట్ల అనుమానాలు బలపడ్డాయి. పార్టీ వ్యతిరేక, ఇబ్బందికర చర్యలకు పాల్పడే వారికి పదవులు దక్కే అవకాశం లేదనే ఊహాగానాలు బలం పుంజుకున్నాయి. ఈ నేపథ్యంలో కోశల వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. జయ నారాయణ మిశ్రా రాజకీయ ఉద్ధండుడు. వరుసగా 5 సార్లు రాష్ట్ర శాసన సభకు ప్రాతినిధ్యం వహించారు. రాష్ట్రంలో బీజేపీ సంక్లిష్ట పరిస్థితుల్లో 2022-24 మధ్య కాలంలో జయ నారాయణ మిశ్రా శాసన సభలో ప్రతిపక్ష నాయకుడిగా కీలక బాధ్యతల్ని విజయవంతంగా నిర్వహించారు. ఎన్నికలు ముగిసి పార్టీ విజయం సాధించిన తర్వాత ఆయనకు మోహన్ చరణ్ మాఝి కొలువులో స్థానం కొరవడింది. దీంతో ఆయన తీవ్ర నిరుత్సాహానికి గురయ్యారు. కొత్త కొలువులో కూడ అవకాశం ఊగిసలాడే పరిస్థితులు తాండవిస్తున్నాయి. తాజా పరిణామాలపట్ల అందరి దృష్టి కేంద్రీకృతమైంది.

విపక్షాల ఎదురు దాడి

బీజేపీ ఎమ్మెల్యే సంచలనాత్మక వ్యాఖ్యల ఆధారంగా విపక్ష బిజూ జనతా దళ్, కాంగ్రెసు ఎదురు దాడికి దిగాయి. రాష్ట్ర గౌరవం పరిరక్షణ హామీతో గద్దెనెక్కి రాష్ట్ర ఘన చరిత్రకు కళంకం తెచ్చే వ్యాఖ్యల్ని చేయడం ఏమిటో ఆ పార్టీ అధిష్ఠాధిపతులు మోహన్ చరణ్ మాఝి, నరేంద్ర మోదీ, అమిత్ షా రాష్ట్ర ప్రజలకు బదులు చెప్పాలని బహిరంగంగా సవాలు విసురుతున్నారు.

క్లుప్తంగా

భక్తజన జాతర



రాజమ్మ తల్లి జాతరలో జనసందోహం

గార: మండలంలోని చిన్న వత్సవలసలో కొలువైన రాజమ్మ తల్లి (రాజరాజేశ్వరి) దర్శనానికి ఐదో ఆదివారం ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. చాలా మంది శనివారం రాత్రే వచ్చేసి ఉదయాన్నే సమీప సముద్రంలో పవిత్ర స్నానాలు ఆచరించిచారు. అనంతరం భూలోకమ్మ, రాజరాజేశ్వరి (రాజమ్మతల్లి)ని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. తొలి సంతానానికి పుట్టుకొప్పు తీయించి ముడుపులు చెల్లించుకున్నారు.

ముగిసిన టెక్నివర్స్ ఫెస్ట్



విద్యార్థులు ప్రదర్శించిన ఫ్లాష్‌మాబ్ డ్యాన్స్

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీ) శ్రీకాకుళం ఎస్ఎంపురం క్యాంపస్‌లో కొనసాగుతున్న టెక్నివర్స్ ఫెస్ట్–2025 ఆదివారంతో ముగిసింది. మూడు రోజుల పాటు ఉత్సాహంగా, విజ్ఞానదాయకంగా ఈ ఫెస్ట్ కొనసాగింది. చివరి రోజు క్యాంపస్‌లో విద్యార్థులు ప్రదర్శించిన మాబ్‌ఫ్లాష్ డ్యాన్స్ ఉర్రూతలూగించింది. అనంతరం వివిధ విభాగాల విజేతలకు బహుమతులు, ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ కొక్కిరాల వెంకట గోపాల ధన బాలాజీ, పరిపాలన అధికారి ముని రామకృష్ణ, డీన్ ఆఫ్ అకడమిక్ కొర్ల మోహన్‌కృష్ణ చౌదరి, కన్వీనర్ గేదెల రవి, సహాయ కన్వీనర్ తేజ్‌కిరణ్, పీఆర్‌ఓ మామిడి షణ్ముఖ పాల్గొన్నారు.

డీఎస్సీ–2003 టీచర్లకు పాత పెన్షన్ అమలుచేయాలి



మాట్లాడుతున్న కొత్తకోట శ్రీహరి

శ్రీకాకుళం అర్బన్: డీఎస్సీ–2003 ఉపాధ్యాయులకు పాతపెన్షన్ విధానం అమలు చేయాలని డీఎస్సీ ఫోరం–2003 జిల్లా కన్వీనర్ కొత్తకోట శ్రీహరి డిమాండ్ చేశారు. శ్రీకాకుళంలోని ఎన్జీవో కార్యాలయంలో ఆదివారం ఫోరం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2003 డీఎస్సీ నియామకాలలో ప్రభుత్వమే రెండేళ్లు ఆలస్యం చేసిందని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మెమో 57 మేరకు పాత పెన్షన్ విధానాన్ని తమకూ వర్తింప చేసి న్యాయం చేయాలని కోరారు. అనంతరం ఫోరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా కన్వీనర్‌గా పి.శ్రీహరి, కో–కన్వీనర్లుగా పి.శ్రీకర్, కె.ప్రకాష్, బి.శ్రీనివాసరావు, ఎ.లక్ష్మణరావులు ఎన్నికయ్యారు. సమావేశంలో సభ్యులు ఎస్.ఫల్గుణరావు, ఎం.బుచ్చిబాబు, జి.భాస్కరరావు, ఆపస్ జిల్లా అధ్యక్షులు దుప్పల శివరాం ప్రసాద్, జి.చిన్నికృష్ణంనాయుడు పాల్గొన్నారు.

ట్రావెల్స్ బస్సులో గంజాయి సీజ్



మడపాం టోల్ గేట్ వద్ద బస్సుల్లో తనిఖీలు చేస్తున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

నరసన్నపేట: గంజాయి అక్రమ రవాణాను శ్రీకాకుళం టాస్క్‌ఫోర్స్ పోలీసులు అడ్డుకున్నారు. జాతీయ రహదారిపై తులసీ ట్రావెల్ బస్సులో మూడు సూటు కేసుల్లో ఉన్న గంజాయి బండిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. గంజాయి తరలిస్తున్న నలుగురిలో ముగ్గురు పట్టుబడగా ఓ వ్యక్తి పరారయ్యాడు. అతని కోసం పోలీసులు గాలింపు చేపట్టారు. సాధారణ తనిఖీల్లో భాగంగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులను మడపాం టోల్‌గేట్ వద్ద ఆదివారం ఆపగా గంజాయి రవాణా గుట్టు రట్టయ్యింది. పూర్తి వివరాలు సోమవారం వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

లక్ష్మణరావుపై కేసు నమోదు

ఎచ్చెర్ల: లావేరు గ్రామానికి చెందిన వృద్ధురాలు సౌభాగ్యవతి ఎస్పీ కార్యాలయానికి వచ్చి తన ఆవేదన వెల్లడించిన వైనంపై 'వృద్ధురాలిపై కన్నకొడుకు దాష్టీకం' శీర్షికన ఈ నెల 9న సాక్షిలో వచ్చిన కథనానికి లావేరు పోలీసులు స్పందించారు. సౌభాగ్యవతి కుమారుడు లక్ష్మణరావుపై కేసు నమోదుచేశారు. సౌభాగ్యవతి తన భర్త పేరిట ఉన్న స్థలంలో దుకాణం పెట్టుకునేందుకు ఇటీవల ప్రయత్నించగా చిన్న కుమారుడు లక్ష్మణరావు అడ్డుకుని తన తల్లిని చెక్కతో గాయపరిచిన సంగతి తెలిసిందే.



కార్యక్రమంలో పాల్గొన్న కళాకారులు, నిర్వాహకులు

మన సంస్కృతి గొప్పది



కళాకారుల నృత్యం



థింసా నృత్యం



నృత్యప్రదర్శన

రాయగడ:

మన భాష, సంస్కృతి ఎంతో గొప్పవని, వాటిని ఆదరించాలని జిల్లా పరిషత్ ముఖ్యకార్యనిర్వాహక అధికారి అక్షయ కుమార్ ఖెముండో అన్నారు. జిల్లాలోని టికిరి దొరగుడలో గల ఉత్కళ అలూమిన కర్మాగారం ప్రాంగణంలో శని, ఆదివారాల్లో నిర్వహించిన ఆమో నృత్యో..ఆమో సంస్కృతి అన్న సాంస్కృతిక కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా అవిభక్త కొరాపుట్ జిల్లాలో గల 20 గ్రామాలకు చెందిన కళాకారులు వివిధ నృత్యాలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఉత్కళ అలూమ్ని కర్మాగారం యూనిట్ హెడ్ రవినారాయణ మిశ్రో మాట్లాడుతూ స్థానికంగా గల కళాకారులను ప్రోత్సహించడంతో పాటు మన భాష,సంస్కృతి, కళలను పరిరక్షించడమే ధ్యేయంగా గత 9 ఏళ్లుగా ఆమో నృత్యో .. ఆమో సంస్కృతి అన్న పేరిట ఈ తరహా సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని అన్నారు.

• లక్ష కుంకుమార్చన



లక్ష కుంకుమార్చనల్లో పాల్గొన్న భక్తులు

రాయగడ: సదరు సమితి పరిధిలోని జేకేపూర్‌లో గల కల్యాణవేంకటేశ్వర మందిరం 49వ వార్షికోత్సవంతోపాటు బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయ ప్రాంగణంలో సామూహిక లక్ష కుంకుమార్చనలు ఘనంగా జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకులు పాండూరు వెంకట ప్రదీప్, ఆంపోలు రంగనాథాచార్యులు ఆధ్వర్యంలో ఈ పూజలు ఘనంగా జరిగాయి. వందల సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు పట్నాన గౌరి శంకర్‌రావు ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు జరగుతున్నాయి. స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు. సోమవారం గరుడ వాహన సేవ, సాయంత్రం శ్రీవారి కల్యాణ మహోత్సవ కార్యక్రమాలు ఉంటాయని తెలియజేశారు.

ఉత్సాహంగా రంగవల్లుల పోటీలు



బహుమతులు అందజేస్తున్న స్వాస్ మేనేజర్ సునీత

పర్లాకిమిడి: సొసైటీ ఆఫ్ వెల్ఫేర్ ఫర్ వీకర్ సెక్షన్స్ (స్వాస్) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఆరో వార్డు సేరిమేదరి వీధిలో ఆదివారం మహిళలకు రంగవల్లుల పోటీలు నిర్వహించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ పోటీలు నిర్వహించినట్టు స్వాస్ టీమ్ అధికారి పి.సునీత అన్నారు. రంగవల్లుల పోటీల్లో 30 మంది పాల్గొన్నారు. ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు.

సాధువులకు ఘన స్వాగతం



జైన్ సాధువులు, గురువులు



26వ జాతీయ రహదారిలో నడచి వస్తున్న జైన్ సాధువులు

జయపురం: ఛత్తీష్‌ఘడ్ నుంచి పాదయాత్రగా జయపురం చేరిన ఏడుగురు జైన్ సాధువులకు స్థానిక జైన్ సంప్రదాయ ప్రజలు ఆదివారం ఘన స్వాగతం పలికారు. ఛత్తిష్‌ఘడ్ సరిహద్దు ఒడిశా రాష్ట్ర కొరాపుట్ జిల్లా జయపురం సబ్ డివిజన్ కొట్‌పాడ్ మీదుగా వస్తున్న జైన్ సాధువులకు స్థానిక జైన్ సమాజ్ ప్రతినిధి సంజయ్ కుమార్ జైన్ నేతృత్వంలో పలువురు జైన్ సంప్రదాయులు జయపురానికి 10 కిలో మీటర్ల దూరం వెళ్లి స్వాగతం పలికారు. అక్కడ నుంచి వారిని జయపురంలో గల జైన్ మందిరానికి తీసుకువచ్చారు. జైన్ మందిరంలో మహావీర్ జైన్ విగ్రహాన్ని సాధువులు పూజలు చేసి మందిరంలో విశ్రాంతి తీసుకున్నారు. ఆదివారం ఉదయం 9 గంటలకు జైన్ మందిరంలో సాధువులు ప్రవచన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున జైనులు పాల్గొన్నారు.

అన్నయ్యపై తమ్ముడి దాడి

టెక్కలి రూరల్: మండల కేంద్రం టెక్కలిలోని రెల్లివీధి సమీపంలో పరపటి వినోద్ అనే వ్యక్తి తీవ్ర గాయాలతో అంబేడ్కర్ జంక్షన్ నుంచి పోలీస్‌స్టేషన్ వైపుగా భార్యాపిల్లలతో కలిసి రోడ్డుపై వెళ్లడం ఆదివారం స్థానికంగా కలకలం రేపింది. తలపై రక్తాలు కారడంతో ఏమైందని అడిగినా స్పందించకపోవడంతో స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. అనంతరం గాయపడిన వ్యక్తిని టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై టెక్కలి సీఐ విజయ్‌కుమార్ వద్ద ప్రస్తావించగా అన్నదమ్ముల మధ్య గొడవ జరిగిందని, తమ్ముడు బాల అన్నయ్య వినోద్‌ను కర్రతో కొట్టి గాయపరిచాడని తెలిపారు. పోలీసులు వివరాలు సేకరిస్తున్నట్లు చెప్పారు.

కన్నీళ్లకే.. కన్నీళ్లొచ్చే..!

- పేద మహిళకు పెద్దకష్టం
- కిడ్నీవ్యాధి సోకడంతో ఇబ్బందులు
- దాతలు ఆదుకోవాలని వేడుకోలు



నందిగాం: ఆడపిల్ల పుట్టిందని నాడు తండ్రి విడిచిపెట్టి వెళ్లిపోయాడు. జీవితాంతం తోడు ఉంటానని అగ్నిసాక్షిగా పెళ్లాడిన భర్త రెండేళ్లకే వదిలేశాడు. అయినా ధైర్యం కోల్పోక ముందుకు సాగుతున్న ఆమెకు కిడ్నీ భూతం కాటేయడంతో దిక్కుతోచని స్థితిలో పడిపోయింది. విధి చేతిలో ఓడిపోయి నిస్సహాయ స్థితిలో సాయం కోసం ఎదురుచూస్తున్న కాంతమ్మ దీనస్థితి ఇది. వివరాల్లోకి వెళ్తే.. నందిగాం మండలం మర్లపాడుకు చెందిన కోనారి వెంకయ్య, నీలమ్మల కుమార్తె కాంతమ్మ. అయితే కాంతమ్మ పుట్టిన తర్వాత మగబిడ్డ పుట్టలేదని చెప్పి తండ్రి వెంకయ్య కోపంతో భార్య, కుమార్తెను విడిచిపెట్టి మరో మహిళతో వెళ్లిపోయాడు. దీంతో పేదరికంలో పెరిగిన కాంతమ్మ కూలి పనులు చేసుకుంటూ తల్లికి తోడుగా ఉండేది. పెళ్లి ఈడు వచ్చేసరికి గ్రామస్తులు సహకరించి సమీప ప్రతాపవిశ్వనాథపురం గ్రామానికి చెందిన వ్యక్తితో వివాహం చేశారు. అయితే తాగుడుకు బానిసైన ఆయన రెండేళ్లకే భార్యను విడిచిపెట్టడంతో కాంతమ్మ మరలా కన్నవారింటికి చేరింది.

కూలి పనులతోనే జీవనం

కూలీ పనులు, ఉపాధి పనులు చేసుకుంటూ తల్లి ఉంటున్న పూరి గుడిసెలో కాంతమ్మ జీవనం సాగిస్తుండేది. వదిలి వెళ్లిన తండ్రి ఐదేళ్ల క్రితం గ్రామ సమీప తోటలో శవంగా మరడంతో కుమారుడిలా అంత్యక్రియలు చేసి కన్నరుణం తీర్చుకుంది. విడిచిపెట్టిన భర్త కొద్దిరోజులకే చెరువులో పడి విగతజీవిగా మారాడు. తల్లి వృద్ధాప్యానికి చేరుకొని కంటి సమస్యతో కుమార్తె కాంతమ్మ మీద ఆధారపడింది. అయినప్పటికీ ధైర్యంగా కష్టాలను ఎదుర్కొని తల్లికి సపర్యలు చేసుకుంటూ జీవనం సాగించేది. అయితే రెండేళ్ల క్రితం కిడ్నీ భూతం కాంతమ్మకు సోకింది. మొదటిలో కూలీ చేసిన డబ్బులతో వైద్యం పొందేది. అయితే క్రమేపీ వ్యాధి తీవ్రత పెరిగి కూలీ చేసుకోలేని స్థితికి చేరుకుంది. దీంతో గ్రామంలోని కొంతమంది యువకులు ఆర్థిక సాయం చేస్తూ పలాసలో ఉన్న కిడ్నీ ఆస్పత్రికి తీసుకువెళ్లి చికిత్స అందిస్తున్నారు. అయితే ఇటీవల వ్యాధి తీవ్రత బాగా పెరగడంతో కాంతమ్మ మంచానికే పరిమితమైపోయింది. ఫలితంగా తల్లీకూతుళ్లు ఇద్దరూ ఇబ్బంది పడుతున్నారు. పూట గడవడమే కష్టంగా మారిన స్థితిలో డయాలసిస్ చేయించుకునే స్థోమత లేకుండా పోయింది. దీంతో జీవితంలో ఎన్నో కష్టాలను ధైర్యంగా ఎదుర్కొన్నా, ఎక్కడా చేయిచాచని కాంతమ్మ విధికి తలవంచి దాతల సాయం కోసం ఎదురుచూస్తోంది. మనసున్న మారాజులు ఎవరైనా ఆదుకోవాలని కోరుతోంది. తనకు సాయం చేయాలనుకునేవారు **9440487406** నంబర్‌ను సంప్రదించాలని కోరుతోంది.

235 మందికి శిక్షణ ఇస్తాం..



రిజిస్ట్రేషన్ శిబిరంలో పాల్గొన్న రిజిస్ట్రార్ మహేశ్వర నాయక్, తదితరులు

జయపురం: ప్రధాన మంత్రి ఇంటర్న్‌షిప్ పథకంలో కొరాపుట్ జిల్లాల్లో 235 మంది 10వ తరగతి, +2, డిగ్రీ విద్యార్థులకు శిక్షణ ఇస్తారు. ఈ పథకంపై స్థానిక విక్రమదేవ్ విశ్వవిద్యాలయంలో కౌన్సెలింగ్, రిజిస్ట్రేషన్ శిబిరం శనివారం మధ్యాహ్నం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ మహేశ్వర్ నాయక్ అధ్యక్షతన వహించారు. ఈ ప్రక్రియ ఈ నెల 12వ తేదీ వరకు ఉంటుందన్నారు. ఎక్కువ మంది యువతీ, యువకులు పేర్లు నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక, బీమా కంపెనీ సహాయ శిక్షణ కార్యక్రమమని వెల్లడించారు. ఈ శిక్షణలో 21 నుంచి 24 వయసు లోపు యువతీ, యువకులు అర్హులన్నారు. విద్యార్హత మెట్రిక్, ఆపైన ఉండాలి. కుటుంబ ఆదాయం ఏడాదికి 8 లక్షల కన్నా తక్కువ ఉండాలి. కొరాపుట్ జిల్లాలో 235 మందికి అవకాశం ఉంటుందన్నారు. 1045 మంది పేర్లు నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు. పేర్లు నమోదు చేసుకునేవారు 2022–2024 మధ్యలో ఉత్తీర్ణులై ఉండాలని వెల్లడించారు.ఎంపికైనవారికి జిల్లాలో 8 కంపెనీల్లో శిక్షణకు అవకాశం కల్పిస్తామన్నారు. హిందూస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హాల్)లో 100 మందికి, నేషనల్ అల్యూమినియం కంపెనీ లిమిటెడ్(నల్కో)లో 88 మందికి, పవర్ గ్రిడ్ కార్పొరేషన్‌లో 24 మందికి, ఇండియన్ ఐఎల్ కార్పొరేషన్‌లో ఒకరికి, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో 12 మందికి, ఇండస్ ఇండ్ బ్యాంక్‌లో ఐదుగురుకి, జె.కె. సిమెంట్ కంపెనీలో ఒకరికి, రిలయన్స్ కంపెనీలో నలుగురికి శిక్షణ పొందే అవకాశం ఉందన్నారు. శిక్షణ కాలంలో నెలకు రూ.5 వేలు, స్టైఫండ్ ఉంటుందన్నారు. శిక్షణ పొందిన వారికి బీమా పథకం వర్తింపజేస్తారని వెల్లడించారు. పోస్టు గ్రాడ్యుయేట్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ ప్రసన్న కుమార్ పాత్రో, ప్రధాన మంత్రి ఇంటర్న్‌షిప్ పథకం నోడల్ అధికారి సచిన్ కుమార్ నాయక్, ఎగ్జామినేషన్ కంట్రోలర్ రంజన్ కుమార్ ప్రదాన్, హ్యూమన్ రిసోర్స్ డవలపమెంట్ కేంద్ర డైరెక్టర్ దేవదుత్త, పీఈటీ భగవత్ ప్రసాద్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి క్రీడల్లో కిశోర్ చంద్ర రథ్‌కు బంగారు పతకం



బంగారు పతకం సాధించిన కిశోర్ చంద్ర రథ్



రూర్కెలాలో గోల్డు మెడల్ సాధించిన కిశోర్ చంద్ర రథ్

పర్లాకిమిడి: ఒడిశాలోని రూర్కెలా బిర్సాముండా స్టేడియంలో ఈ నెల ఆరు నుంచి తొమ్మిదో వరకు జరిగిన ఏడవ జాతీయ ఆథ్లెటిక్ గేమ్స్‌లో పర్లాకిమిడికి చెందిన అబ్కారీశాఖ విశ్రాంత ఏఎస్సై కిశోర్ చంద్ర రథ్ బంగారు పతకాలు సాధించారు. దాదాపు 1600 మంది క్రీడాకారులు పాల్గొన్న జాతీయ ఆథ్లటిక్ ఈవెంట్స్‌లో 100 మీటర్లు పరుగుపందెం, లాంగ్ జంప్, ట్రిపుల్ జంప్‌లో గోల్డు మెడల్ సాధించాడు. దీనిపై గజపతి జిల్లా క్రీడాభిమానులు, జిల్లా క్రీడాశాఖ అధికారి అరుణ్ కుమార్ శెఠి అభినందనలు తెలియజేశారు. గతంలో కిశోర్ రథ్ అనేక అంతర్జాతీయ, జాతీయ క్రీడా పోటీల్లో అనేక బంగారు, కాంస్య పతకాలు సాధించాడు.

ఉత్కళ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో రజకుల సమావేశం



మాట్లాడుతున్న సంఘం అధ్యక్షులు మోహన్‌రావు



రజక వికాస్ పరిషత్ సమావేశానికి హాజరైన రజక కుటుంబాలు

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో నివసిస్తున్న రజక కుటుంబాల ఉన్నత విద్య, వైద్యం, మౌళిక సమస్యల కోసం ఉత్కళ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం 19వ సాధారణ సమావేశం జరిగింది. స్థానిక టౌను హాలులో జరిగిన ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా పురపాలక అధ్యక్షురాలు నిర్మలా శెఠి విచ్చేసి డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి వందనం సమర్పించారు. సంఘం అధ్యక్షులు కె.మోహన్ రావు, ఉపాధ్యక్షులు, గౌరవ అతిథులుగా ఏఆర్‌సీ ఎస్ నారాయణ శెఠి, ప్రధాన ఉపాధ్యాయులు పురుషోత్తం బెహరా తదితరులు పాల్గొన్నారు.

రఘునాథ సేవలు అభినందనీయం



ప్రముఖ రంగస్థల నటులు రఘునాథ పోరిచ్చా



సభలో మాట్లాడుతున్న విశ్రాంత ఎస్పీ సుభాష్ జమాదార్



ఒడియా చలనచిత్రనటులు, దర్శకులు నరేంద్ర మిశ్రాను సన్మానిస్తున్న జిల్లా కలెక్టర్ బిజయకుమార్

పర్లాకిమిడి: ప్రముఖ రంగస్థల కళాకారులు రఘునాథ పోరిచ్చా సేవలు అభినందనీయమని విశ్రాంత ఎస్పీ సుభాష్ జమాదార్ అన్నారు. కటక్, పర్లాకిమిడి, భుభనేశ్వర్‌లో రాధామాధవ్, గోపీనాథ వల్లభ, లక్ష్మణ చంద్రోదయం వంటి అనేక నాటకాలు ప్రదర్శించి ఎనలేని కీర్తిని గడించారని గుర్తు చేశారు. కవి రఘునాథ పోరిచ్చాపై పీహెచ్‌డీ విద్యార్థులు పరిశోధన చేయాలని జమాదార్ కోరారు. స్థానిక ఒడియా మంగలివీధిలో ఉత్కళ హితేషిణీ సభావేదికపై జరుపుకున్న ఇష్టాగోష్టి సభకు ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ బిజయ కుమార్ దాస్ విచ్చేయగా, ముఖ్యవక్తగా పూర్ణచంద్ర మహాపాత్రో, రంగస్థల దర్శకులు డాక్టర్ నరేంద్ర మిశ్రా, గౌరవ అతిథులుగా డాక్టర్ రామక్రిష్ణ పోరిచ్చా, క్రిష్ణచంద్ర గజపతి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జితేంద్రనాథ్ పట్నాయక్, కోఆర్డినేటరు బిచిత్రానంద బెబర్తా, బినోద్ చంద్ర జెన్నా, భరత్ భూషన్ మహంతి పాల్గొన్నారు. గజపతి జిల్లా కాశీనగర్ సమితి లివురి గ్రామంలో జన్మించిన కవి రఘునాథ పోరిచ్చా అనేక నాటకాలు రచించి ప్రదర్శించారని సినీనటులు, రంగస్థల కళాకారులు డాక్టర్ నరేంద్ర కుమార్ మిశ్రా అన్నారు. పర్లాకిమిడిలో రంగస్థల కళాకారులు ఎందరు వున్నా ఒక వేదిక లేదని, ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తున్న రంగస్థల వేదికను కొందరు అడ్డుకుంటున్నారని రంగస్థల నటులు ఆదర్శ దాస్ అన్నారు. ఈ సందర్భంగా చలనచిత్రనటులు, దర్శకులు, అనేక రాష్ట్ర ఆవార్డులు పొందిన నటులు డాక్టర్ నరేంద్ర మిశ్రాకు జిల్లా కలెక్టర్ బిజయకుమార్ దాస్ చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు. అనంతరం ఒడియా సంగీతంలో అకాశవాణి కళాకారిణి కోమలాంగి గానంతో ప్రేక్షకులను అలరించారు.

ఆశలు గల్లంతు

- సముద్రంలో గల్లంతైన గ్రూప్–2 అభ్యర్థి
- రాజమ్మతల్లి జాతర స్నానాల్లో అపశృతి
- మరో నలుగురిని కాపాడిన మెరైన్ పోలీసులు

గార: మండలంలోని చిన్న వత్సవలస రాజమ్మ తల్లి జాతర సముద్ర స్నానాల్లో అపశృతి చోటుచేసుకుంది. ఆదివారం మధ్యాహ్నం జి.సిగడాం మండలం దేవరవలసకు చెందిన తండ్రీ కొడుకులు కొడమటి ఈశ్వరరావు, అశోక్(23) సముద్ర స్నానానికి వెళ్లగా అలల తాకిడి గల్లంతయ్యారు. తోటివారు కేకలు వేయడంతో మెరైన్ పోలీసులు స్పందించి తండ్రి ఈశ్వరరావును ఒడ్డుకు తీసుకురాగలిగారు. అశోక్ ఆచూకీ దొరకలేదు. అశోక్ ఎంఎస్సీ పూర్తి చేసి, ఇటీవలే గ్రూప్–2 పరీక్షలు రాశాడు. తండ్రి ఈశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గార ఎస్ఐ ఆర్.జనార్దన కేసు నమోదు చేశారు. కాగా, ఇదే ప్రాంతంలో చీపురుపల్లి మండలం కాపుశంభాం గ్రామానికి చెందిన చందక వంశీ, పిన్నింటి జయలక్ష్మీ, పిన్నింటి దిలీప్ సముద్ర స్నానానికి దిగి చిక్కుకుపోతున్న తరుణంలో మెరైన్ ఎస్ఐ హరికృష్ణ టీం సభ్యులు గమనించి రక్షించారు. లైఫ్ జాకెట్లు ఉపయోగించి నీటిలో ఇబ్బందులు పడుతున్న ముగ్గురినీ ఒడ్డుకు తీసుకొచ్చి సపర్యలు చేశారు.



పిన్నింటి జయలక్ష్మికి సపర్యలు చేస్తున్న మెరైన్ పోలీసులు, (ఇన్‌సెట్లో) గల్లంతైన కొడమటి అశోక్ (ఫైల్)

క్లుప్తంగా

మూగజీవులు సజీవ దహనం



మంటల్లో కాలిపోయిన గొర్రెలు

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని పర జపాడు గ్రామంలో శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు మూగజీవాలు ఉన్న పశువుల శాలకు నిప్పంటించారు. ఈ మేరకు జరిగిన ప్రమాదంలో రెండు గొర్రెలు, 20 కోళ్లు సజీవ దహనమైనట్లు గ్రామానికి చెందిన గుంట్రెడ్డి శివున్నాయుడు ఆదివారం చినమేరంగి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పి.అనీష్ ఆదివారం తెలిపారు.

33 మద్యం సీసాలతో వ్యక్తి అరెస్ట్

తెర్లాం: మండలంలోని డి.గదబవలస గ్రామంలో అక్రమంగా మద్యం సీసాలు తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు పట్టుకుని అరెస్ట్ చేశారు. దీనికి సంబంధించి ఆదివారం తెర్లాం ఎస్సై సాగర్‌బాబు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. డి.గదబవలస గ్రామానికి చెందిన ఓ వ్యక్తి 33 మద్యం సీసాలు తీసుకు వెళ్తున్నట్లు శనివారం రాత్రి సమాచారం రావడంతో దారికాచి ఆ వ్యక్తిని మద్యం సీసాలతో పట్టుకున్నామని తెలిపారు. ఆ వ్యక్తి గ్రామంలో అనధికారికంగా మద్యం విక్రయిస్తున్నాడని చెప్పారు. ఎప్పటిలాగానే మద్యం సీసాలు విక్రయించేందుకు తీసుకు వెళ్తుండగా పట్టుకుని 33 మద్యం సీసాలను సీజ్ చేయడంతో పాటు అరెస్ట్ చేశామన్నారు.

1500 లీటర్ల బెల్లం ఊటలు ధ్వంసం



బెల్లం ఊటలు పారబోస్తున్న పోలీసులు

సీతంపేట: మండలంలోని నెల్లిగండి కొండల ప్రాంతంలో సారా వండడానికి నిల్వచేసిన 1500 లీటర్ల బెల్లం ఊటలు ధ్వంసం చేసినట్లు ఎస్సై వై.అమ్మన్నరావు తెలిపారు. సారా వంటకాలు జరుగుతున్నాయనే సమాచారం రావడంతో తమ సిబ్బందితో దాడులు చేయగా 20 డ్రమ్ములతో నిండి ఉన్న బెల్లం ఊటలు లభించగా ధ్వంసం చేసినట్లు తెలిపారు.

నేరాలను అదుపు చేసేందుకు సీరియల్ నంబర్లు

- ఎస్పీ మాధవ్ రెడ్డి

పార్వతీపురం రూరల్: నేరాలను అదుపుచేసేందుకు ఒకే పట్టణం, ఒకే ఆటో ఒకే సంఖ్య విధానాన్ని అమలు చేయనున్నట్లు పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఎస్వీ మాధవ్ రెడ్డి పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఆటో యూనియన్లు, ఎన్ని ఆటోలు ఉన్నాయి. యజమానులు, డ్రైవర్లు, ఆటోలకు సంబంధించిన రికార్డుల అన్ని వివరాలు ఆయా స్టేషన్‌లలో నమోదు చేయనున్నట్లు తెలిపారు. ఈ ప్రక్రియ వల్ల పక్క రాష్ట్రాల నుంచి, వేరే ప్రాంతాల నుంచి వచ్చే ఆటోల సమాచారం, అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాలను నిరోధించేందుకు, కనుగొనేందుకు అవకాశం ఉంటుందన్నారు. అలాగే ప్రమాదాలు జరిగినప్పుడు తప్పించుకుని వెళ్లేందుకు ప్రయత్నించే ఆటోల వివరాల కూడా ఈ సంఖ్యల ద్వారా గుర్తించగలమని అభిప్రాయ పడ్డారు. ఈ నమోదు ప్రక్రియపై ఇటీవల జిల్లావ్యాప్తంగా ఆయా స్టేషన్ల సిబ్బందికి మార్గదర్శకాలు జారీ చేసినట్లు తెలిపారు.

సెల్‌ఫోన్‌లో టెన్త్ హాల్‌టికెట్

పార్వతీపురం: వాట్సాప్ గవర్నెన్స్‌లో భాగంగా పదోతరగతి హాల్ టికెట్స్‌ను కూడా ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. దీంతో పదోతరగతి విద్యార్థులు ఎక్కడికీ వెళ్లకుండా తమ చేతిలో ఉన్న సెల్‌ఫోన్ ద్వారా హాల్‌టికెట్ తీసుకునే వెసులుబాటు కల్పించింది. హాల్‌టికెట్ తీసుకోవడానికి విద్యార్థులు ఫోన్ 9552300009 నంబర్‌కు వాట్సాప్ ద్వారా హాయ్ అని మెసేజ్ చేస్తే..ఏ సేవ కావాలో ఎంచుకోవాలని వస్తుంది. అక్కడ విద్యను ఎంపిక చేసుకోవాలి, పదో తరగతి హాల్ టికెట్స్ విభాగాలు కనిపిస్తాయి. పదో తరగతి హాల్ టికెట్స్‌ను ఎంపిక చేసుకుని విద్యార్థి ఐడీ, పుట్టిన తేదీవంటి వివరాలను నమోదు చేస్తే పీడీఎఫ్ రూపంలో హాల్‌టికెట్ డౌన్‌లోడ్ అవుతుంది.

నేడు పీజీఆర్ఎస్

సీతంపేట: స్థానిక ఐటీడీఏలో సోమవారం నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) స్థానిక ఐటీడీఏలోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు ఐటీడీఏ పీఓ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమస్యలపై గిరిజనులు వినతులు సమర్పించవచ్చన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం టౌన్: సమగ్ర శిక్ష కార్యాలయంలో ఖాళీగా ఉన్న సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్‌ను పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.తిరుపతినాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 15 మండలాల నుంచి ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మున్సిపల్ పాఠశాలలో పని చేస్తున్న అర్హత గల స్కూల్ అసిస్టెంట్‌ల నుంచి ఈ నెల 10 నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. దరఖాస్తులను ఈ నెల 12 సాయంత్రం 5 గంటలలోగా సమగ్ర శిక్ష కార్యాలయంలో అందజేయాలని సూచించారు. పై పోస్టులకు సంబంధించిన దరఖాస్తు, అర్హత వివరాలు హెచ్‌టీటీపీఎస్:// పార్వతీపురం మన్యం.ఈఏఎఫ్ఐఏసీఈ.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైటు నందు పొందుపరిచినట్లు తెలిపారు.

అంగరంగ వైభవంగా...
పోలిపల్లి పైడితల్లమ్మ జాతర

- వేలాదిగా తరలివస్తున్న భక్తులు
- మూడు రోజుల పాటు నిర్వహణ
- సేవా కార్యక్రమాల్లో అధికారులు, స్వచ్ఛంద సంస్థలు

రాజాం/రాజాం సిటీ: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవంగా పేరొందిన రాజాంలోని పోలిపల్లి పైడితల్లి అమ్మవారి ఆలయ 99వ జాతర ఉత్సవాలు ఆదివారం అంగరంగ వైభవంగా ప్రారంభం అయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే జాతరలో తొలి రోజు నుంచే పైడితల్లి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు వేలాదిగా తరలివస్తున్నారు. భక్తులతో బొబ్బిలి రోడ్డులో జనసందోహం నెలకొంది.



గర్భగుడిలో పుష్పాలంకరణలో యాత్రకు ముస్తాబైన పోలిపల్లి పైడితల్లి అమ్మవారు

అమ్మవారి కొలువు ఇలా...

పట్టణ పరిధిలోని కొండంపేట గ్రామానికి చెందిన లంకలపల్లి వంశీకులు వెంకప్ప ఒకనాడు విజయనగరం జిల్లా పోలిపల్లి గ్రామంలో యాత్రకు కుటుంబంతో వెళ్లాడు. జాతరను చూసి తిరిగి వస్తుండగా కొంతదూరం వచ్చేసరికి ఎవరో బండి ఎక్కినట్లు, బండి బరువెక్కి ఎడ్లు లాగడానికి కష్టంగా తోచడంతో వెనుదిరిగి చూశాడు. ఎవరూ కనిపించలేదు. అలాగే ఆ చీకటిలో ప్రయాణం చేసి కొండంపేట పరిసరాలకు వచ్చేసరికి ఎవరో బండిపై నుంచి కిందకు దూకినట్లు గజ్జల ధ్వని వినిపించింది. ఇంతలో నేను పైడితల్లిని పోలిపల్లి నుంచి నీ బండిపై వచ్చాను. ఈ పనస చెట్టుపై కొలువుంటానని పలికినట్లు ఆయనకు వినిపించింది. వెంకప్ప అమ్మవారిని భక్తితో నమస్కరించి ఇంటికి చేరుకొని ఈ విషయాన్ని బంధుమిత్రులకు చెప్పగా అప్పటి నుంచి అమ్మవారు కొలువున్న పనస చెట్టు ఆయన వంశీకులు, గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల వారు పసుపు కుంకుమలు ఇచ్చి పూజించడం ప్రారంభించారు.

నమ్మకం ఇలా..

రాజాం పట్టణానికి చెందిన వ్యాపారి వాకచర్ల మల్లయ్య కోర్టు వ్యవహారాల్లో చిక్కుకొని తరచు పార్వతీపురం కోర్టుకు వెళ్తుండేవారు. కేసులు ఎంతకీ తేలక నష్టాల పాలయ్యారు. ఇలాంటి పరిస్థితిలో అమ్మవారు కలలో కనిపించి పనస చెట్టు వద్ద తనకు గుడి కట్టించమని కోరింది. మరునాడు ఆయన కోర్టు వ్యవహారాలపై పార్వతీపురం వెళ్తూ అమ్మవారికి నమస్కరించి కోర్టు వ్యవహారంలో జయం కలిగితే తప్పకుండా ఆలయం కట్టిస్తానని మొక్కుకున్నాడు. అనుకున్నదే తడవుగా కోర్టు వ్యవహారంలో గెలవడమే కాక దొంగలపాలైన అతని ధనం తిరిగి లభించింది. ఆ సంతోషంతో అమ్మవారిని దర్శించి ఆలయ నిర్మాణానికి ఏర్పాట్లు ప్రారంభించారు. తన స్నేహితులైన పీసపాటి సత్యన్నారాయణాచార్యులు, పొట్టా సత్యన్నారాయణ, సలాది వెంకటప్పడు, గుడివాడ పెంటయ్య సహాయంతో వాస్తు పండితుడైన మజ్జి రమణయ్య సూచనలతో 1926లో ఆలయ నిర్మాణం మొదలు పెట్టి 1927 నాటికి పూర్తి చేశారు. అప్పటి నుంచి ప్రతి ఏడాది ఫాల్గుణమాసం శుక్లపక్షంన పౌర్ణమి ముందు వచ్చే ఆది, సోమ, మంగళవారాల్లో అమ్మవారి జాతర అత్యంత వైభవంగా రాజాంలో జరుగుతుంది.

400 మంది సిబ్బందితో బందోబస్తు

ఉత్తరాంధ్రలో ప్రసిద్ధిగాంచిన పోలిపల్లి పైడితల్లి అమ్మవారి జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పోలీసులు జాగ్రత్తలు తీసుకున్నారు. 400 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటుచేశామని చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు అన్నారు. జాతరను పర్యవేక్షించేందుకు 27 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు డ్రోన్స్ సహాయంతో నిరంతర పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు.


సేవా కార్యక్రమాల్లో సంస్థలు

రాజాం పట్టణానికి చెందిన సత్యసాయి సేవా సంస్థలు, వాసవీ క్లబ్ సభ్యులు, రెడ్ క్రాస్ బృందంతో పాటు పలు స్వచ్ఛంద సంస్థలు సేవా కార్యక్రమాలు ప్రారంభించాయి. రాజాం పట్టణం జాతర సందర్భంగా కళకళలాడుతోంది. ఆలయ ఆవరణలో విద్యుత్ దీపాలంకరణ కనువిందు చేస్తుంది.



విద్యుత్ కాంతులతో ఆలయం

వైభవంగా పునర్వసు పట్టాభిషేకం



స్వామి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు



అభిషేక ప్రియుడిగా దర్శనమిస్తున్న స్వామివారు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో పునర్వసు పట్టాభిషేకం కార్యక్రమాన్ని అర్చకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేకువజామున స్వామికి ప్రాతఃకాలార్చన, బాలభోగం నిర్వహించిన తరువాత యాగశాలలో సుందరకాండ హవనం జరిపించారు. అనంతరం ఆలయంలో వెండి మంటపం వద్ద సీతారామస్వామిని నూతన పట్టు వస్త్రాలతో సుందరంగా అలంకరించి స్వామి వారి నిత్య కల్యాణ మహోత్సవ ఘట్టాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఉత్సవమూర్తుల వద్ద రామాయణంలో పట్టాభిషేకం సర్గ విన్నవించి శ్రీరామచంద్రమూర్తికి పాలు, పెరుగు, తేనె, నెయ్యి, వివిధ రకాల ఫల రసాలతో విశేష అభిషేకాలు, పట్టాభిషేక మహోత్సవాన్ని వైభవంగా జరిపించారు. కార్యక్రమంలో అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

'శతర' కవితా సంపుటి ఆవిష్కరణ



శతర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ తదితరులు (ఫైల్)

పార్వతీపురం: తాను రచించిన 'శతర' ఆదివాసీ కవితా సంపుటిని ఛత్తీస్‌గఢ్‌లోని రాయపూర్‌లో నిర్వహించిన ద్వితీయ తెలుగు మహాసభల్లో సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ.రమణ శనివారం ఆవిష్కరించారని ప్రముఖ కవి సిరికి స్వామినాయుడు పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన తన స్వగృహంలో మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన తెలుగు మహాసభల్లో ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారని చెప్పారు. 'శతర' పుస్తకంలో అడవుల్లోని అందాలు, గిరిజనుల ఆచారాలు, సంప్రదాయాలు, విద్య, ఆరోగ్యం, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా గిరిజనుల విధానంలో మార్పు తదితర అంశాలను పొందుపరిచినట్లు వివరించారు. తాను రాసిన కవితా సంపుటికి దేశంలో గుర్తింపు రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

రాత్రి 11గంటల తరువాత సంచరించొద్దు



కమాండ్ కంట్రోల్ ద్వారా సిబ్బందికి ఆదేశాలు ఇస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: సహేతుకమైన కారణం లేకుండా అర్ధరాత్రి నగరంలో తిరిగితే టౌన్ న్యూసెన్స్ చట్టం కింద కేసులు నమోదు చేస్తామని ఎస్పీ వకుల్ జిందల్ హెచ్చరించారు. ఈ మేరకు నగరంలోని బ్యారెక్స్ వద్ద ఉన్న కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి అన్ని స్టేషన్ హౌస్ ఆఫీసర్లతో ఆదివారం సమీక్ష నిర్వహించారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు కొన్ని కఠిన నిర్ణయాలు తప్పవని, అందుకు అనుగుణంగా పోలీస్ అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. విజయనగరంలో రైల్వేస్టేషన్, ఆర్టీసీ కాంప్లెక్స్, మూడు లాంతర్లు, కోట జంక్షన్, బాలాజీ జంక్షన్, దాసన్నపేట రైతుబజార్, రింగు రోడ్డు, కొత్తపేట, ఐస్ ఫ్యాక్టరీ, జమ్ము, వీటీ అగ్రహారం, బొబ్బిలి, నెల్లిమర్ల, రాజాం మున్సిపాలిటీల్లో కొన్ని ముఖ్య ప్రాంతాల్లోను పోలీసులు తనిఖీలు చేపడుతున్నారన్నారు. రాత్రి 11గంటల తరువాత వ్యాపారాలు, షాపులు, టిఫిన్ బండ్లు మూసివేసే విధంగా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా వ్యాపారాలు సాగించినా, కారణాలు లేకుండా బహిరంగ ప్రదేశాల్లో సంచరించిన వారిపై టౌన్ న్యూసెన్స్ చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కేసు నమోదు చేసిన వారిని స్టేషన్‌కు పిలిపించి, వారి తల్లిదండ్రులను రప్పించి, కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామన్నారు. నేరాల నియంత్రణలో భాగంగా ఇప్పటివరకు రాత్రి గస్తీల్లోను, పెట్రోలింగ్ నిర్వహించడంలో మౌలికమైన మార్పులను చేపట్టారు. రాత్రి పెట్రోలింగ్, గస్తీ విధులకు వెళ్లే పోలీసు సిబ్బందితో సంబంధిత పోలీసు అధికారులు సమావేశమై, రాత్రి గస్తీలో నిర్వహించాల్సిన విధుల పట్ల వారికి దిశా నిర్దేశం చేస్తున్నట్లు చెప్పారు. ఇక రాత్రి గస్తీ, పెట్రోలింగ్ నిర్వహించే పోలీసు సిబ్బంది తమ వెంట తప్పనిసరిగా విజిల్స్, లాఠీలను తప్పనిసరిగా తీసుకుని వెళ్లాలని ఆదేశించారు. కాగా జిల్లా వ్యాప్తంగా జనవరి నుంచి ఇప్పటివరకు 850 మందిపై టౌన్ న్యూసెన్స్ చట్టం ప్రకారం కేసులు నమోదు చేసి, కౌన్సెలింగ్ నిర్వహించామని ఎస్పీ చెప్పారు.

ఏడుగురు జూదరుల అరెస్టు

పార్వతీపురం రూరల్: పార్వతీపురం మండలంలోని లక్ష్మీనారాయణపురం గ్రామం పరిధిలో గల వ్యవసాయ పొలాల్లో జూదం ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను ఆదివారం అదుపులోకి తీసుకున్నట్లు పార్వతీపురం రూరల్ ఎస్సై బి.సంతోషి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముందస్తు సమాచారం మేరకు దాడి చేసి జూదం ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి దగ్గర నుంచి రూ.15,050 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు, జూదం ఆడుతున్న వారిలో ఒక మహిళ కూడా ఉన్నట్లు ఎస్సై చెప్పారు.

రాజకీయాలకు అతీతంగా టీచర్లకు సేవలందిస్తా

- ఉత్తరాంధ్ర టీచర్స్ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు



సత్కారం పొందుతున్న టీచర్స్ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు

విజయనగరం అర్బన్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే అజెండాగా రాజకీయాలకు అతీతంగా సేవలు అందిస్తానని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ డాక్టర్ గాదె శ్రీనివాసులు నాయుడు ఉద్ఘాటించారు. పీఆర్‌టీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక తోటపాలెంలోని ప్రైవేట్ కళాశాల ప్రాంగణంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఈ మేరకు ఆయన స్పష్టం చేశారు. తాను ఎన్నికైన తరువాత ముఖ్యమంత్రిని కలిసిన సమయంలో ఆయన దృష్టికి ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న ఉపాధ్యాయ, విద్యా రంగంలోని సమస్యలను తీసుకెళ్లానని వివరించారు. ప్రభుత్వానికి ఉపాధ్యాయులకు మధ్య వారధిగా ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డి.శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రధానకార్యదర్శి వి.రవీంద్రనాయుడు, ఆర్.రాంబాబు, బంకపల్లి శివప్రసాద్, ఆల్తి రాంబాబు, డెక్క వెంకటరావు, శంకర్‌నాయుడు, వివిధ మండల కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు. అదే విధంగా ఏపీటీఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సంఘం కార్యాలయంలో ఎమ్మెల్సీని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ ఉపాధ్యా ప్రగతి ప్రధాన సంపాదకుడు జి.సత్యనారాయణ, గౌరవ అధ్యక్షుడు ఎ.సదాశివరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.చిరంజీవి, రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.ఈశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి పి.ధనుంజయరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మధుసూదన రావు, డి.వెంకటనాయుడు, ఆరు జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, పీఆర్‌టీయూ జిల్లా కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

చినమేరంగి సర్కిల్ ఆఫీసుకు ఐదుగురు ట్రైనీ ఎస్సైలు



నూతనంగా బాధ్యతలు చేపట్టిన ట్రైనీ ఎస్సైలు

జియ్యమ్మవలస రూరల్: పోలీస్ సూపరింటెండెంట్ ఎస్వీ మాధవ్‌రెడ్డి ఆదేశాల మేరకు జియ్యమ్మవలస మండలంలోని చినమేరంగి సర్కిల్ ఆఫీస్‌లో ఐదుగురు ట్రైనీ ఎస్సైలు ఆదివారం విధుల్లో చేరారు. ఈ మేరకు ఎస్సై పి.అనీష్ వారిని అభినందిస్తూ సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాధవ్ రెడ్డి మాట్లాడుతూ నక్సల్స్ ప్రభావిత ప్రాంతమైన చినమేరంగి, జియ్యమ్మవలస పోలీస్‌స్టేషన్‌లలో ట్రైనీ ఎస్సైలు నియమితులయ్యారని, వారంతా సీఐ వీటీ తిరుపతిరావు పర్యవేక్షణలో విధులు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కమ్యూనిటీ పోలీసులతో పాటు వారిలో చినమేరంగికి ఎం.అనిల్ రెడ్డి, వి.మణికంఠేశ్వర రెడ్డి, వై జ్యోతిలను నియమించగా, జియ్యమ్మవలస పోలీస్‌స్టేషన్‌లో వి.నారాయణరెడ్డి, వి ప్రదీప్‌లు విధులు నిర్వహించేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు.

పిల్లలు తల్లిదండ్రుల ప్రతిబింబాలు

- డీఈఓ యూ.మాణిక్యం నాయుడు



వార్షికోత్సవాల్లో ఆకట్టుకున్న చిన్నారుల ఆటపాటల ప్రదర్శన

విజయనగరం అర్బన్: విద్యార్థులు బాల్యంలో తమ తల్లిదండ్రులను అనుకరిస్తారని వారికి మంచి విద్య ద్వారానే వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దవచ్చని జిల్లా విద్యాశాఖ అధికారి యూ.మాణిక్యం నాయుడు అన్నారు. ఈ మేరకు స్థానిక గురజాడ పాఠశాలలో ఆదివారం జరిగిన 27వ వార్షికోత్సవానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విలువలతో కూడిన అత్యుత్తమ విద్యను అందించడానికి విద్యాసంస్థలు ఉత్తమ నిర్వహణతో పాటు విద్యార్థి వ్యక్తిత్వంపై తల్లిదండ్రులు శ్రద్ధ చూపడం అవసరమన్నారు. విద్యార్థి దశ నుంచి విద్యతోపాటు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కళాప్రదర్శన, చిన్నారుల ఆటపాటలు తల్లిదండ్రులను ఆకట్టుకున్నాయి. పాఠశాల కరెస్పాండెంట్ స్వరూప ఆధ్వర్యంలో జరిగిన ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్సీ రఘువర్మ, రిటైర్డ్ డీఈఓ అరుణకుమారి, పాఠశాల డైరెక్టర్ డాక్టర్ ఎంవీఆర్‌కృష్ణాజీ, ప్రధానోపాధ్యాయుడు పూడి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సేవలతోనే మెరుగైన సమాజం

విజయనగరం గంటస్తంభం: సమాజంలోని మహిళలు తమ సేవలు పూర్తిస్థాయిలో అందిస్తేనే మెరుగైన సమాజం ఏర్పడుతుందని లోక్ సత్తాపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. ఈ మేరకు ఆదివారం గురజాడ పబ్లిక్ స్కూల్‌లో సారథి వెల్ఫేర్ అసోసియేషన్, శ్రీ అమ్మా సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉన్న అన్ని మహిళా సంఘాల ప్రతినిధులను ఒక వేదికపైకి తీసుకువచ్చి సత్కరించడం అభినందనీయమని, సారథి వెల్ఫేర్ అధ్యక్షుడు ప్రదీప్ కుమార్ వెంకటరావు చేసిన పనిని జిల్లాలోని మహిళా ఎమ్మెల్యేలు, మహిళా అధికారులు చేస్తే బాగుండేదని భీశెట్టి అభిప్రాయం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన కొత్త పారిశ్రామిక విధానంలో మహిళలు తమకు సరిపడ పరిశ్రమలను ఏర్పాటు చేసుకుని అభివృద్ధి చెందాలని పిలుపునిచ్చారు. మహిళల కోసం అనేక చట్టాల్లో మార్పులు తెచ్చినప్పటికీ అనుకున్న స్థాయిలో మహిళలకు ఉపయోగపడడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో లక్కీ శేఖర్, మహిళా సంఘాల నేతలు వెంకటలక్ష్మి, కాంచన, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

తాళ్లబురిడిలో విజృంభించిన డయేరియా

- ఇప్పటి వరకు 54 మంది బాధితులు
- ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పలువురు రోగగ్రస్తులు
- గ్రామంలో పరీక్షలు చేపట్టిన వైద్య సిబ్బంది

పార్వతీపురం రూరల్: మండలంలోని తాళ్లబురిడిలో రెండు రోజులుగా డయేరియా విజృంభిస్తోంది. శని, ఆదివారాల్లో 54 మంది డయేరియా బారిన పడ్డారు. వీరిలో కొందరు డోకిశీల పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్నారు. డయేరియా తాగునీటి కలుషితం వల్ల వ్యాపించిందా? లేక ఆహార పదార్థాల కలుషితం వల్ల విజృంభించిందా? అనేది ఆస్పత్రి వర్గాలకు తెలియరావడం లేదు. ఇప్పటికే దీనికి సంబంధించిన తాగునీటి నమూనాలను పరీక్షించేందుకు ల్యాబ్‌కు తరలించారు. గ్రామంలో డయేరియా తగ్గుముఖం పట్టకపోవడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. పీహెచ్‌సీ వైద్యుల సూచన మేరకు గ్రామంలో డయేరియా మరింత ప్రబలకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆటోపై ఆదివారం ప్రచారం చేపట్టారు. మరోవైపు వైద్య సిబ్బంది గ్రామానికి చేరుకొని వ్యాధి లక్షణాలు ఉన్న వారిని పరీక్షిస్తున్నారు. అవసరమైన వారికి మందులు అందజేస్తున్నారు. ఆస్పత్రిలో చేరిన వారికి అవసరమైన వైద్యసేవలు అందిస్తున్నారు. డయేరియా వ్యాధి బారిన పడిన వారిలో మహిళలు ఎక్కువగా ఉన్నారు. ఇదిలా ఉండగా గ్రామంలో డయేరియా వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుతుండడంతో వైద్య శిబిరాలు నిర్వహించి ప్రజారోగ్యాన్ని కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

అంగన్‌వాడీల ఆందోళన అణిచివేతకు కుట్ర..!



హౌస్‌అరెస్టులో ఉన్న జిల్లా అధ్యక్షురాలు పైడిరాజు

విజయనగరం ఫోర్ట్: రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సోమవారం చలో విజయవాడ కార్యక్రమాన్ని అంగన్‌వాడీలు తలపెట్టారు. అంగన్‌వాడీల ఆందోళనను అణిచివేసేందుకు కూటమి ప్రభుత్వం అధికారులతో కుట్ర చేస్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈనెల 10వతేదీన చలో విజయవాడ పేరిట ధర్నా చేస్తామని అంగన్‌వాడీలు ముందుస్తుగా ఐసీడీఎస్ సీడీపీఓలకు వినతి పత్రం ఇచ్చారు. తీరా రేపు సమావేశం అనగా ఆందోళనకు వెళ్లొద్దని నేరుగా చెప్పకుండా ప్రతి ఐసీడీఎస్ సెక్టార్ పరిధిలో అంగన్‌వాడీ కార్యకర్తలకు సమావేశాలు నిర్వహిస్తున్నట్లు ఐసీడీఎస్ అధికారులు అంగన్‌వాడీలకు తెలియజేశారు. సమావేశానికి కచ్చితంగా ప్రతి అంగన్‌వాడీ కార్యకర్త హాజరు కావాలని, లేదంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరికలు కూడా జారీ చేసినట్లు సమాచారం. ముందుగా సెలవు పెట్టిన వారి దరఖాస్తులు సైతం తిరస్కరించాలని సూపర్‌వైజర్లకు అధికారులు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. జిల్లాలో ఉన్న 90 సెక్టార్లలోనూ సమావేశాలు నిర్వహించనున్నారు.

యూనియన్ నాయకుల హౌస్ అరెస్టులు

అంగన్‌వాడీ యూనియన్ నాయకులు విజయవాడలో జరిగే ఆందోళనలో పాల్గొనకుండా పోలీసులు వారిని హౌస్ అరెస్టు చేస్తున్నారు. విజయనగరంలో అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బి.పైడిరాజు, జిల్లా కమిటీ సభ్యురాలు తులసిలను హౌస్ అరెస్టు చేశారు.

జిల్లావ్యాప్తంగా సమావేశాలు

జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని సెక్టార్లలో సమావేశాలు నిర్వహించాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. ఈ మేరకు అన్ని సెక్టార్లలో సమావేశాలు నిర్వహించనున్నాం.

జి.ప్రసన్న, ఇన్‌చార్జి పీడీ, ఐసీడీఎస్

హెడ్ స్లూయిస్ షట్టర్ల మార్పిడి

- పరిశీలించిన డీఈ రవీంద్ర నాయుడు



పనులను పరిశీలిస్తున్న డీఈ వై.రవీంద్రనాయుడు



వేసేందుకు సిద్ధంగా ఉన్న షట్టర్లు

సంతకవిటి: మండలంలోని ప్రధాన సాగునీటి వనరైన నారాయణపురం ఆనకట్టలో దాదాపు రూ.35లక్షల వ్యయంతో హెడ్ స్లూయిస్ షట్టర్ల మార్పిడి పనులు ప్రారంభించారు. కుడి, ఎడమ ప్రధాన కాలువల ద్వారా శివారు ఆయకట్టు రైతులకు నీరు అందించడంలో ఈ షట్టర్లదే ప్రధాన భూమిక. ఈ ఆనకట్ట నుంచి కుడి ప్రధాన కాలువ ద్వారా 18691 ఎకరాలకు, ఎడమ ప్రధాన కాలువ ద్వారా 18362 ఎరాలకు సాగునీరు అందుతుంది. ఈ మేరకు డీఈ వై.రవీంద్రనాయుడు ఆదివారం పనులను పరిశీలించారు. వారంరోజుల్లో ఆనకట్ట షట్టర్లు మార్పిడి పనులు పూర్తిచేసి సాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా డీఈ తెలిపారు.



నారాయణపురం ఆనకట్ట